RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | ఎడిటర్ : చెరుకు ఉపేందర్ | ఆదివారం | 31 -12 - 2023
సంపుటి: 1 | సంచిక : 226 | పేజీలు : 4 | వెల : 5/-



అంబులెన్స్‌కు దారిచ్చిన సీఎం కాన్వాయ్

2లో

# అమ్మొద్దు.. అపోహలొద్దు..



- దరఖాస్తు విక్రయాలపై సీఎం రేవంత్ సీరియస్
- ప్రజాపాలన అర్జీలు అమ్మేవారిపై చర్యలకు ఆదేశం
- అవసరమైనన్ని దరఖాస్తులు పంపిణీ చేయాలని హుకుం
- రైతుభరోసా, పింఛన్లపై అనుమానాలొద్దని ప్రజలకు సలహా
- పాత లబ్ధిదారులందరికీ పథకాలు యథాతథమని స్పష్టం
- కొత్తగా పొందాలనుకునే వారే దరఖాస్తు చేసుకోవాలని సూచన
- అధికారులతో సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :
ప్రజాపాలన దరఖాస్తుల అమ్మకాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. దరఖాస్తుదారులకు అవసరమైనన్ని దరఖాస్తులను అందుబాటులో ఉంచాల్సిందేనని అధికారులను ఆదేశించారు. రైతుబంధు, పింఛన్లపై అపోహలకు గురి కావద్దని, పాత లబ్ధిదారులందరికీ యథావిధిగా ఈ పథకాలు అందుతాయని స్పష్టం చేశారు. గతంలో లబ్ధి పొందని వారు, కొత్తగా లబ్ధి పొందాలనుకునేవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ విషయంలో ప్రజలు ఎలాంటి గందరగోళానికి గురి కావద్దని తెలిపారు. ప్రజా పాలన దరఖాస్తుల సరళి, క్షేత్ర స్థాయిలో పరిస్థితులపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ఈ నెల 28 నుంచి ప్రజా పాలన కార్యక్రమం ప్రారంభమైన నేపథ్యంలో ఇప్పటి వరకు జరిగిన గ్రామసభలు, దరఖాస్తుల వివరాలు, ప్రజా పాలన దరఖాస్తులు స్వీకరిస్తున్న విధానం, ప్రజల్లో స్పందనకు సంబంధించి పూర్తి వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తుల కొరత లేకుండా అవసరమైనన్ని దరఖాస్తులు అందుబాటులో ఉంచాలని సూచించారు. దరఖాస్తు చేసుకోవాలనుకునేవారికి ఎట్టి పరిస్థితుల్లో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దరఖాస్తులను అమ్మేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని

మిగతా 2వ పేజీలో...

# ఇదేం అభిమానమో..!




- మోదీకి గుజరాత్‌పైనే వల్లమాలిన ప్రేమ
- అభివృద్ధిలో సొంత రాష్ట్రానికే పెద్దపీట
- పరిశ్రమల కేటాయింపులన్నీ అక్కడికే
- తాజాగా టెస్లా కూడా స్వరాష్ట్రానికే?
- దక్షిణాదిపై కొనసాగుతున్న నిర్లక్ష్యం
- సోదరులంటూనే తెలంగాణపై చిన్నచూపు
- విభజన హామీలను అటకెక్కించిన కేంద్రం
- దక్షిణ భారతం నుంచి విమర్శలపర్వం
- పీఎం ఆ రాష్ట్రానికేనా అంటూ ప్రశ్నలు




గాంధీనగర్, ప్రభాతసూర్యుడు :
దేశంలో ప్రధాని నరేంద్రమోదీ ఉత్తరాది రాష్ట్రాలకు ఇస్తున్న ప్రాధాన్యం దక్షిణాది రాష్ట్రాలకు ఇవ్వడం లేదన్న ఆరోపణ చాలాకాలంగా ఉంది. చట్టపరంగా రావాల్సిన సంస్థలను కూడా మోదీ తరలించుకుపోతున్నారన్న అభిప్రాయం దక్షిణాది రాష్ట్రాల్లో ఉంది. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ విభజన సందర్భంగా తెలంగాణ, ఆంధ్రకు రావాల్సిన అనేక ప్రాజెక్టులను మోదీ పెండింగ్‌లో పెట్టారు. మంజూరు చేసామన్న కాజిపేట కోచ్ ఫ్యాక్టరీ, మంజూరైన ఐటీఐఆర్, బయ్యారం ఉక్కు కర్మాగారం.. ప్రాజెక్టులకు జాతీయ హోదా.. ఇలా అనేక హామీలు పదేళ్లుగా అమలుకు నోచుకోవడం లేదు. కోచ్ ఫ్యాక్టరీ, ఐటీఐఆర్ గుజరాత్‌కు తరలించుకున్నారు. ఏపీకి వచ్చిన

మిగతా 3వ పేజీలో...

# అయోధ్య అందరిదీ!

- రైల్వే స్టేషన్‌ను ప్రారంభించిన మోదీ
- అత్యాధునాతనంగా ఆధునికీకరణ
- జాతికి అంకితం చేసిన ప్రధానమంత్రి
- వందే, అమృత్‌భారత్ రైళ్లకు పచ్చజెండా
- వందేభారత్‌లో విద్యార్థులతో ముచ్చట్లు



లక్నో, ప్రభాతసూర్యుడు :
కొత్తగా హంగులు అద్దిన అయోధ్య రైల్వే స్టేషన్ ప్రారంభించారు. ఇప్పటికే ఉన్న స్టేషన్‌కు కొత్త హంగులు అద్ది మరింత అందంగా తీర్చి దిద్దారు. దీనికి అయోధ్యధామ్ జంక్షన్ అని పేరు పెట్టారు. ఈ రెనోవేషన్ కోసం ప్రభుత్వం రూ.240 కోట్లు ఖర్చు చేసింది. లిఫ్టు, ఎస్కలేటర్లు, వెయిటింగ్ హాల్స్, క్లాక్‌రూమ్స్‌తో పాటు ఫుడ్ ప్లాజాలు ఏర్పాటు చేసింది. రామ మందిర ఆకృతిలోనే స్టేషన్‌ను తీర్చి దిద్దారు. ఆ తరవాత యోగి ఆదిత్యనాథ్, కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో కలిసి స్టేషన్‌ను పరిశీలించారు. అంతకు ముందు ప్రధాని నరేంద్ర మోదీకి ఎయిర్‌పోర్టులో స్వాగతం పలికారు యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్. ఆయనతో పాటు రాష్ట్ర గవర్నర్ ఆనందీబెన్

మిగతా 2వ పేజీలో...

## అంతా వట్టిదే..

3లో

- ఎన్నికల్లో పోటీ ప్రచారమేనన్న గవర్నర్
- వదంతులేనని స్పష్టం చేసిన తమిళిసై



నేను పోటీ చేస్తానని అధిష్టానాన్ని కలిశానని జరుగుతున్నది కేవలం ప్రచారం మాత్రమే.

- గవర్నర్ తమిళిసై



## ఆ'కట్టుకుంటున్న చలానా' ఆఫర్

- ఇప్పటివరకు 10 లక్షల చలాన్లు క్లియర్
- రాష్ట్ర ఖజానాకు పెరుగుతున్న ఆదాయం
- జనవరి 10వరకు కొనసాగనున్న గడువు
- ఫైన్‌ల చెల్లింపునకు వాహనదారుల మొగ్గు
- సైట్ ఇబ్బందులతో పెల్లుబుకుతున్న అసహనం

హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :
తెలంగాణలో పెండింగ్ లో ఉన్న ట్రాఫిక్ చలాన్లు క్లియర్ చేయడానికి జనాలు ఎగబడుతున్న సంగతి తెలిసిందే. పెండింగ్ చలాన్లను వసూలు చేసే ఉద్దేశంతో వాటిపై రాయితీ ఇస్తామని ఇటీవల ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డి.. అందుకు తగ్గట్లే జీవో కూడా విడుదల చేశారు. డిసెంబర్ 26 నుంచే పెండింగ్ చలాన్లపై రాయితీ వర్తిస్తుందని జీవోలో చెప్పారు. కొంతమంది డిసెంబర్ 26 తర్వాత కొత్తగా పడ్డ ట్రాఫిక్ చలాన్లకు కూడా ప్రభుత్వం ప్రకటించిన రాయితీ వస్తుందని భావిస్తున్నారు. కానీ, డిసెంబర్ 26 తర్వాత ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడుతూ చలాన్ పడ్డ వారికి ఈ రాయితీ వర్తించబోదని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. ప్రభుత్వ జీవో ప్రకారం డిసెంబరు 25కు ముందు పడ్డ చలాన్లకు మాత్రం నిర్దేశిత డిస్కౌంట్ వర్తించనుంది. పెండింగ్ చలానాలు వసూలు చేసుకునేందుకు తెలంగాణ పోలీసు శాఖ, రవాణా శాఖ కలిసి డిస్కౌంట్ ఆఫర్ ప్రకటించిన సంగతి తెలిసిందే. దీంతో పెండింగ్ చలానాలు భారీగా క్లియర్ అవుతున్నాయి. కోట్ల రూపాయాల్లో ప్రభుత్వానికి ఆదాయం వచ్చి పడుతోంది. ఇప్పటికే రూ.10 కోట్ల

మిగతా 3వ పేజీలో...



## నకిలీ డ్రగ్స్ స్వాధీనం

హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :
ఉత్తరాఖండ్‌లోని కాశీపూర్ నుంచి తెలంగాణ రాష్ట్రంలోకి నకిలీ డ్రగ్స్ ప్రవేశంపై డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు సేకరించిన ఇంటెలిజెన్స్ ఆధారంగా, తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ ప్రత్యేక బృందం డిసెంబర్ 29న హైదరాబాద్లోని పలు ప్రాంతాల్లో దాడులు నిర్వహించి ఛేదించింది. నకిలీ యాంటీబయాటిక్స్, హైపర్టెన్షన్, కొలెస్ట్రాల్ మందులు, అనాల్జెసిక్స్, ఇరవై ఆరు లక్షల విలువైన నకిలీ డ్రగ్స్ నిల్వలను స్వాధీనం చేసుకుని సీజ్ చేసారు. 'ట్రాకాన్ కొరియర్స్ ప్రైవేట్ లిమిటెడ్' పేరుతో కొరియర్ షిప్పింగ్ కంపెనీ ద్వారా

మిగతా 3వ పేజీలో...

# ఆడ వారిద్దరే!

- ఖమ్మం ఎంపీ స్థానంపై మహిళామణుల గురి
- రేణుకా వర్సెస్ నందిని మధ్య టికెట్ సమరం
- అధిష్టానాన్ని మచ్చిక చేసుకునే పనిలో నిమగ్నం
- ఎవరికి వారుగా ధీమాతో క్షేత్రస్థాయిలో ప్రచారం

ఖమ్మం, ప్రభాతసూర్యుడు :
ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఖమ్మం జిల్లాలో సత్తా చాటింది. మొత్తం 10 సీట్లకు గాను 9 సెగ్మెంట్లలో సత్తా చాటింది. ఆ పార్టీ అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలుపొందారు. ఇదే ఊపుతో ఖమ్మం ఎంపీని కైవసం చేసుకుంటామని కాంగ్రెస్ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. అయితే.. హైకమాండ్ టికెట్ ఎవరికి ఇస్తుందన్న అంశం మాత్రం జిల్లా రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది. పదేళ్ల క్రితం వరకు ఖమ్మం కాంగ్రెస్ అంటేనే రేణుకా చౌదరి, వనమా వెంకటేశ్వరరావు, సంభాని చంద్రశేఖర్ లాంటి పేర్లు వినిపించేవి. కానీ ఇప్పుడు ఆ పరిస్థితులు మారిపోయాయి. మధిర నుంచి 2009లో మొదటిసారిగా విజయం సాధించిన భట్టి విక్రమార్క ఇప్పుడు డిప్యూటీ సీఎంగా మారిపోయారు. దీంతో ఆయన జిల్లా కీలక నేతగా మారిపోయారు. ఎన్నికల ముందు పార్టీలోకి వచ్చి క్లీన్ స్వీప్ కావడంతో ప్రధాన పాత్ర పోషించిన తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి కూడా కీలకంగా మారిపోయారు. జిల్లా కాంగ్రెస్ రాజకీయం కూడా ఈ ముగ్గురి చుట్టే తిరుగు తోంది. ఈ నేపథ్యంలో ఎంపీ అభ్యర్థి విషయంలోనూ ఇప్పుడు కొత్త పేర్లు వినిపిస్తున్నాయి. డిప్యూటీ సీఎం భట్టి సతీమణి

మిగతా 3వ పేజీలో...



RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# అంబులెన్స్‌కు దారిచ్చిన సీఎం కాన్వాయ్



**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** ఆపదలో ఉన్నవారికి ఆపన్నహస్తం ఇవ్వడంలో సీఎం రేవంత్ రెడ్డి ఎప్పుడూ ముందుంటారు. మరోసారి తన హోదా, అధికారంకన్నా మానవత్వమే మిన్న అని నిరూపించారు సీఎం. శనివారం ముఖ్యమంత్రి తన నివాసం నుంచి సచివాలయానికి వెళ్లే క్రమంలో కేబీఆర్ పార్క్ వద్దకు చేరుకున్నారు. అదే సమయంలో ఓ అంబులెన్స్ అటుగా రావడం కనిపించింది. ఇది గమనించిన సీఎం అంబులెన్స్ కు దారివ్వాలని సూచించారు. దీంతో సీఎం కాన్వాయ్ అంబులెన్స్ కు దారిచ్చింది. అటుగా వెళుతున్న కొందరు ఈ ఘటనను వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. గతంలోనూ తన కోసం ట్రాఫిక్ ను ఆపొద్దంటూ సీఎం తీసుకున్న నిర్ణయంపై రాష్ట్రవ్యాప్తంగా హర్షం వ్యక్తమైంది.



# అధునాతన ఎలక్ట్రానిక్ సిస్టమ్ డిజైన్ -ఐడియేషన్

**ప్రోటోటైపింగ్‌పై జాతీయ స్థాయి ఫాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్**

**ఇబ్రహీం పట్నం - ప్రభాత సూర్యుడు :** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం సమీపంలోని గురునానక్ విద్య సంస్థలో అడ్వాన్స్‌డ్ ఎలక్ట్రానిక్ సిస్టమ్ డిజైన్ –ఐడియేషన్ అండ్ ప్రోటోటైపింగ్ పై అటల్ – ఎఫ్.డి.పి డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఎ.ఐ.సి.టి.ఇ - ఐడియా ల్యాబ్, గురునానక్ ఇన్‌స్టిట్యూషన్స్ టెక్నికల్ క్యాంపస్, హైదరాబాద్‌తో కలిసి ఫాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాము నిర్వహించారు. భారతదేశం నలుమూలల నుండి వివిధ పరిశ్రమలు, విద్యాసంస్థలకు చెందిన సుమారు 600 మంది ఈ కార్యక్రమంలో సభ్యులుగా నమోదు చేసుకొని పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న డాక్టర్ శ్యాంసుందర్ ప్రొఫెసర్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్, కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఉస్మానియా యూనివర్సిటీ, హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ కె. వెంకటరావు, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ పి. పార్థసారథి, డిఎన్ఆర్ అండ్ డి డాక్టర్ ఎస్వీ రంగనాయకులు, ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి మాట్లాడుతూ ఎఫ్.డి.పి వినియోగదారులు ఎలక్ట్రానిక్స్‌లో తయారీ సాంకేతికతలను పాల్గొనేవారికి పరిచయం చేయడం, వారికి ప్రయోగాత్మక అనుభవాన్ని అందించడం, వారికి సంబంధిత రంగాలలో సాంకేతికతలను వర్తింపజేయడానికి ,వీలుకల్పించడానికి దిశానిర్దేశం చేయడం జరుగుతుంది. ఈ టెక్నికల్ ప్రోగ్రామ్‌లో పాల్గొనేవారికి లోతైన సైద్ధాంతిక భావనలు , విభిన్న ఎంబెడెడ్ సిస్టమ్ డిజైన్ టూల్స్ , టెక్నిక్‌ల ప్రోగ్రామింగ్ అంశాలను అందించడానికి ఉపన్యాసాలు, ప్రయోగశాల సెషన్‌లు నిర్వాహకులు ఏర్పాటు చేసి ప్రయోగాత్మకంగా ఔత్సాహిక యువతకు తెలియపరుస్తారు. అడ్వాన్స్‌డ్ ఎలక్ట్రానిక్ సిస్టమ్ డిజైన్–ఐడియేషన్ ప్రోటోటైపింగ్ పై, ప్రోటోటైప్ ఐడియాషన్ డిజైన్ టెక్నిక్స్ , స్ట్రాటజీలపై లెక్చర్ సెషన్‌ల ద్వారా ప్రధాన దృష్టితో, డిజైన్ మెథడాలజీ యొక్క వివిధ దశల ఆచరణాత్మక అంశాలను పాల్గొనే వారికి పరిచయం చేయడం ఈ ఎఫ్.డి.పి యొక్క ప్రధాన లక్ష్యం. కార్యక్రమంలో విద్యాసంస్థల వైస్ చైర్మన్ సర్దార్ జి.ఎస్. కోహ్లీ, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ హెచ్.ఎస్. సైనీ, . ఎఫ్ డి పి కన్వీనర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మణ్, కో–కన్వీనర్‌గా డాక్టర్ ఎస్ మహేశ్వర రెడ్డి హెచ్ఓడి ఇసిఇ, డాక్టర్ సందీప్ పాటిల్ పాల్గొన్నారు .



# సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన మాజీ డీఎస్పీ నళిని

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు :** మాజీ డీఎస్పీ నళిని శనివారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసారు. తెలంగాణ సాధన కోసం తన ఉద్యోగాన్ని సైతం త్యాగం చేసిన ఆమెకు తిరిగి ఉద్యోగం ఇవ్వడంలో ఉన్న అడ్డంకులేంటని గతంలో పోలీసు అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో సీఎం ప్రశ్నించారు. తిరిగి డీఎస్పీగా ఉద్యోగం ఇవ్వలేకపోతే అదే స్థాయిలో మరేదైనా ఉద్యోగం ఇచ్చే అంశంపైనా ఆలోచించాలని సూచించారు. అవసరమైతే తనను కలిసేందుకు నళినికి అవకాశం కల్పించాలని కూడా సీఎం అధికారులకు తెలిపారు. ఈ నేపథ్యంలోనే నళిని శనివారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు.

# అయోధ్య అందరిదీ!

మొదటిపేజీ తరువాయి..

పటేల్ కూడా ఉన్నారు. రైల్వే స్టేషన్‌కు చేరుకునే క్రమంలో ప్రధాని మోదీ మెగారోడ్ షో నిర్వహించారు. ఆయన అభిమానులు పెద్దఎత్తున అక్కడికి చేరుకుని దారి పొడవునా అభివాదం చేశారు. ఇదే స్టేషన్‌లో ఆరు వందేభారత్ రైళ్లతో పాటు, రెండు అమృత్ భారత్ రైళ్లకు పచ్చజెండా ఊపారు. పుష్పుల్ టెక్నాలజీతో తయారు చేసిన ఈ రైళ్లు ఇప్పటి నుంచి అందుబాటులోకి రానున్నాయి. రైల్వే స్టేషన్ని మొత్తం మూడు అంతస్తుల్లో నిర్మించారు. వందేభారత్ రైలు ప్రారంభించిన తరవాత ఆ ట్రైన్‌లో ఎక్కారు ప్రధాని మోదీ. విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. ఈ స్టేషన్‌లో ఇంకెన్నో ప్రత్యేకతలున్నాయి. అందరికీ అందుబాటులో ఉండే ఈ స్టేషన్‌కు సర్టిఫికేట్ లభించింది. అంతే కాదు. చిన్నారుల కోసం ప్రత్యేకంగా ఎనిటజీనిబి ఖీనీనీఎబ అందుబాటులో ఉన్నాయి. సిక్‌రూమ్ కూడా నిర్మించారు. టూరిస్ట్ ఇన్ఫర్మేషన్ సెంటర్ కూడా ఏర్పాటు చేశారు. స్టేషన్ టాప్ ఫ్లోర్‌ను రాముని విల్లు ఆకారంలో నిర్మించారు. అంతే కాదు. ఇందులో ఎయిర్ పోర్ట్ తరహా వసతులు కల్పించారు. ట్యాక్సీ బే కూడా ఉంది.

# అమ్మొద్దు.. అపోహలొద్దు..

మొదటిపేజీ తరువాయి..

జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ప్రజా పాలన కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు విధిగా భాగస్వామ్యం కావాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోను ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజాపాలన క్యాంపుల్లో దరఖాస్తుదారులకు తాగునీరు, సరైన నీడ కోసం టెంట్లు, ఇతర ఏర్పాట్లలో ఎలాంటి లోటు రాకుండా చూడాలని అధికారులకు మరోసారి స్పష్టంగా సూచించారు.

# అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అమలు



- **కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మాధగోని జంగయ్య గౌడ్**
- **వివిధ సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్న వార్తలు నమ్మ వద్దు**

**మంచాల - ప్రభాత సూర్యుడు :** ప్రభుత్వం అమలు చేసే అరు గ్యారంటీ ల పథకాల పై ప్రజలకు వ్యతిరేకత రావాలి అని కోన్ని సోషల్ మీడియాలో అరు గ్యారంటీ ల పథకాలు అమలు కావాలి , తెల్ల రేషన్ కార్డు , కార్లు ,బంగ్లాలు, భూమి ,మూడు నాలుగు ఎకరాల కంటే ఎక్కువ ఉండ కూడదు రైతు బంధు రావాలి అంటే ప్రభుత్వం ఉద్యోగి అయ్యి ఉండరాదు అని ఇంక ఎన్నో కారణాలు చెప్పుతూ ప్రభుత్వానికి వ్యతరేకంగా ఉన్న కొన్ని మీడియా సంస్థలు ఇష్టం వచ్చినట్లు ప్రచారం చేస్తున్నారు .ఇలాంటి ప్రచారాలు తెలంగాణ రాష్ట్ర ప్రజలు నమ్మి మోసపోవద్దు గతంలో బి అర్ యస్ ప్రభుత్వం కార్లు బంగ్లాలు ఉన్న ప్రభుత్వ ఉద్యోగం ఎలాంటి వాహనాలు ఉన్న రేషన్ కార్డులు తొలగించింది ప్రభుత్వ ఉద్యోగి ఇంటిలో వృద్దులు ఉంటే భూమి ఎక్కువ ఉన్న రైతుల వృద్ధుల వికలాంగుల పింఛన్లు కూడా బి అర్ యస్ పార్టీ ప్రభుత్వం తొలగించింది .అదే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం స్వర్గీయ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో దరఖాస్తు చేసుకున్న అర్హులైన వారి అందరికీ సంక్షేమ పథకాల అమలు చేశారని అన్నారు .అదే బాటలో ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన అరు గ్యారంటీ ల పథకాల అమలు కోసం పెట్టుకున్న అర్హులైన వారి అందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయటానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్దంగా ఉన్నారు . తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పై వ్యతిరేకత రావాలని విష ప్రచారలు చేస్తున్న సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు నమ్మి ప్రజలు మోస పోవద్దు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన మాట తప్పదు అన్నారు.అరు గ్యారంటీ ల పథకాలు అర్హులైన వారి అందరికీ అమలు అవుతాయి .ఇబ్రహింపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ప్రతి రోజు అలుపెరగని నేతగా నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో తిరుగుతు ప్రజా పాలన కార్యక్రమంలో పాల్గొని ప్రజల సమస్యలుతెలుసుకుంటు అర్హులైన వారి అందరికీ అరు గ్యారంటీల పథకాలు అమలు చేయిస్తాను అని ప్రజలకు బరోసా ఇస్తున్న ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి కి ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



# ఎమ్మెల్యే తరపున దుస్తుల పంపిణీ

**కుత్బుల్లాపూర్ -ప్రభాత సూర్యుడు**

కులమతాలకు భేదం లేదు అన్ని మతాలు ఒక్కటే అందరూ దేవుళ్ళు ఒక్కటే అనే ఆలోచనతో కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానందగౌడ్ దుస్తులు పంపించి బిఆర్ఎస్ నాయకులచే పంపిణీ చేయించడం జరిగింది. ప్రతి సంవత్సరం లాగానే క్రిస్మస్ పండుగ ను పురస్కరించుకొని క్రైస్తవ మతానికి చెందిన సుమారు ఇరవై మంది కుటుంబీకులకు కుత్బుల్లాపూర్ మండలంలోని అంగడిపేట్ కు చెందిన బిఆర్ఎస్ సీనియర్ నాయకులు అనిల్ గౌడ్ , మండల నవీన్ కుమార్, పి కల్పన ల చేతుల మీదుగా దుస్తుల పంపిణీ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో యువ నాయకులు వినీత్ , బిఆర్ఎస్ కార్యకర్తలు కాలనీవాసులు పాల్గొనడం జరిగింది.



# నంది వనపర్తి ఉన్నత పాఠశాలలో ఘనంగా ఫుడ్ ఫెస్టివల్

**ప్రధానోపాధ్యాయులు రామావత్ కిషన్**

**యాచారం - ప్రభాత సూర్యుడు :** యాచారం మండల పరిధిలోని నందివనపర్తి ఉన్నత పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు పాఠశాల ఆవరణలో వివిధ రకాలైన ఆహార పదార్థాలు తయారు చేసి స్టాల్స్ ఏర్పాటు చేశారు. విద్యార్థులు , కేఎఫ్సీ చికెన్, హైదరాబాద్ బిర్యానీ, డబల్ కా మీఠ, జొన్నరొట్టె, చికెన్ ఫ్రై, పులిహోర, మంచురియా, ఆలుఫ్రై, నువ్వుల లడ్డులు రుచికరమైన వంటి వంటలు చేశారు. ఈ సందర్భంగా ఇన్చార్జ్ ప్రధానోపాధ్యాయులు రమావత్ కిషన్ మాట్లాడుతూ ఫుడ్ ఫెస్టివల్ లాంటి కార్యక్రమాలతో విద్యార్థులలో ఉన్న దాగి ఉన్న సృజనాత్మకతను, నైపుణ్యతను వెలికి తీయవచ్చని అన్నారు. విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు కూడ పెంపొదించవచ్చన్నారు. నేటి ఆధునిక ఆహారపు అలవాట్లతో తిని సతవతమవుతున్న సందర్భంలో పౌష్టికాహారం పట్ల అవగాహన పెంచవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పద్మశ్రీ, శ్రీలత, అరుణ, విజయరాణి, మల్లీశ్వరి, సుధారాణి, మురళీధర్, వెంకట్ రెడ్డి, బోజయ్య, అజయ్ రాథోడ్, సురేష్, లక్ష్మణ్ విద్యార్థులు పాల్గొన్నారు.



# ప్రజాపాలన సద్వినియోగం చేసుకోవాలి

**గ్రామ శాఖ అధ్యక్షులు నర్రే శ్రీశైలం**

**యాచారం - ప్రభాత సూర్యుడు :**

యాచారం మండల పరిధిలోని నంది వనపర్తి గ్రామంలో ప్రజా పాలనలో భాగంగా 3వ రోజు ప్రజలకు అభయహస్తం లోని 6 గ్యారంటీ పథకాల గురించి వివరించి వారికి దరఖాస్తు ఫారాలు అందించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు నెర్రె శ్రీశైలం, మూడేడ్ల వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రజా పాలన కార్యక్రమం ప్రవేశపెట్టి 6 గ్యారంటీల అమలకు శ్రీకారం చుట్టిందని అన్నారు. ఈనెల 28 నుంచి మొదలై జనవరి 6వ తేదీ వరకు గ్రామపంచాయతీలో దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. మహాలక్ష్మి, రైతు భరోసా, చేయూత, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇల్లు వంటి పథకాలు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు నర్రె శ్రీశైలం, ముక్తాల యాదయ్య గౌడ్, ముడెడ్ల వెంకట్ రెడ్డి,%వఇ% ఎంపీటీసీ కొంగరి యాదగిరి, ముచర్ల, మూడేడ్ల విష్ణు ,యాదగిరి,ప్రశాంత్,సాజిద్, షహీద్,మధు,శేఖర్, శ్రీకాంత్, శ్రీను, మల్లయ్య, రాములు, తదితరులు పాల్గొన్నారు.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# మరో 2 రోజులు చలి తీవ్రత



**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** కొద్దిరోజులుగా తెలంగాణ వ్యాప్తంగా చలి తీవ్రత పెరుగుతూ వస్తోంది. ఉదయం వేళల్లో పొగమంచు తీవ్రత కూడా ఎక్కువగా ఉంటోంది. అయితే ఈ రెండు రోజుల పాటు అత్యంత చలి తీవ్రత ఉంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. చలి తీవ్రతనే కాకుండా? పొగ మంచు ఎఫెక్ట్ కూడా ఎక్కువ ఉంటుందని పేర్కొంది. ఈ నేపథ్యంలో?ఈ రెండు రోజులు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్ధిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, మల్కాజ్ గిరి, మెదక్ జిల్లాలో ఉదయం వేళల్లో అధికంగా పొగమంచు పరిస్థితులు ఉంటాయని తెలిపింది.ఇక ఆదివారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్ధిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, మల్కాజ్ గిరి, మెదక్ జిల్లాలో పొగ మంచు ఎక్కువగా ఉంటుందని పేర్కొంది. ఆ తర్వాత రోజుల్లో పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని వెల్లడించింది.

# అయోధ్య అక్షింతలకు స్వాగతం



**రంగారెడ్డి, ప్రభాతసూర్యుడు :** అయోధ్య నుంచి వచ్చిన శ్రీరామ పూజా అక్షింతల పవిత్ర కళశాలను బీరంగూడ ప్రాంతంలోని పలు దేవాలయాలకు పంపించినట్లు తెలిపారు. అయోధ్య నుంచి వచ్చిన పవిత్ర కలశాలు శ్రీరామ జన్మ భూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో బీరంగూడ కు చేరుకున్నాయి. సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గ బీరంగూడ కమాన్ వద్దకు చేరుకున్న అక్షింతలను స్థానికులు మేళతాళాలతో స్వాగతం పలికి పలు ఆలయాలకు ఊరేగింపుగా తీసుకువెళ్లారు. జూన్ 1 నుంచి ప్రతీ కుటుంబానికి పవిత్ర అక్షింతలు శ్రీరామ మందిర నమూన, విగ్రహ ప్రతిష్ఠ ఆహ్వాన పత్రిక అందిస్తామన్నారు విశ్వహిందూ పరిషత్ నిర్వహకులు తెలిపారు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని శ్రీరామ నామాన్ని జపియిస్తూ ముందుకు సాగారు.

# అంతా వట్టిదే..

- **ఎన్నికల్లో పోటీ ప్రచారమేనన్న గవర్నర్**
- **వదంతులేనని స్పష్టం చేసిన తమిళిసై**



**సికింద్రాబాద్, ప్రభాతసూర్యుడు :** నేను ఎన్నికలలో పాల్గొంటానని జరుగుతున్న ప్రచారన్ని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళి సై ఖండించారు. బోయిన్ పల్లి లోని అనురాధ టింబర్ డిపోను గవర్నర్ తమిళ్ సై సందర్శించారు. అయోధ్య రామమందిరానికి తయారు చేసిన ద్వారాలను ఆమె పరిశీలించారు. గవర్నర్ మాట్లాడుతూ నేను పోటీ చేస్తానని అధిష్టానాన్ని కలిశానని జరుగుతున్నది కేవలం ప్రచారం మాత్రమే. పోటీ చేయడం కోసం డిల్లీకి వెళ్ళడం, కాని పెద్దలను కలవడం కానీ చేయను. ప్రస్తుతం తెలంగాణ, పుదుచ్చేరి బాధ్యతలతో సంతృప్తిగా ఉన్నానని ఆమె అన్నారు. నా బాధ్యతలను నేను నిర్వర్తించడానికి 24గంటలు కేటాయిస్తాను. నా భవిష్యత్ ప్రధాని మోడీ, రాముని ఆశిసులతో సాగుతుందని అమెఅన్నారు. అయోధ్య రామమందిర ద్వారాలను రూపొందించే అవకాశం అనురాధ టింబర్ డిపోకు లభించడం తెలంగాణకే గర్వకారణమని అన్నారు.



# పార్లమెంట్ 'షోకు'!

- అన్ని పార్టీల్లో మొదలైన హడావుడి
- బీజేపీలో ఈటెల వర్సెస్ రఘునందన్
- మెదక్ ఎంపీ స్థానంపై ఇద్దరు గురి
- అధిష్టానం ప్రసన్నం కోసం ప్రయత్నం
- లోకల్ లీడర్ల రహస్య సమావేశం
- కొత్తవారికి అవకాశం కోరుతూ నిర్ణయం
- అగ్రనాయకత్వానికి అందిన విన్నపం
- టికెట్ కేటాయింపుపై అయోమయం




**మెదక్, ప్రభాతసూర్యుడు :**
ఇద్దరు నేతలు ఆ పార్టీలో సీనియర్స్, కానీ ఎమ్మెల్యేలుగా పోటీ చేసి ఓడిపోయారు. ఇక ఇప్పుడు ఎంపీ సీట్ పై దృష్టి సారించారు. ఎంపీగా అయిన గెలవాలని తహతహలాడుతున్నారు. అయితే ఆ ఇద్దరు నేతలు ఒకే ఎంపీ స్థానం పై కన్నేశారట. ఆ ఎంపీ టికెట్ కోసం ఎవరికి వారు పార్టీ అధిష్టానం వద్ద పైరవీలు మొదలు పెట్టారట. మెదక్ ఎంపీ సీట్‌కి భారీగా డిమాండ్ పెరిగిందని వార్తలు వస్తున్నాయి. అన్ని పార్టీల నేతలు టికెట్ కోసం విశ్వ ప్రయత్నం చేస్తున్నారట. అయితే కమలం పార్టీలో ఇద్దరు సీనియర్ లీడర్లు మాత్రం మెదక్ ఎంపీ టికెట్ కోసం గట్టి ప్రయత్నాలు మొదలు పెట్టారని తెలుస్తోంది. ఎలాగైనా టికెట్ దక్కించుకోవాలనే పనిలో బిజీగా ఉన్నారట. బీజేపీ పార్టీలో ఉన్న రఘునందన్ రావు, ఈటెల రాజేందర్ ఇద్దరు కీలక నేతలు మెదక్ ఎంపీ టికెట్‌ను ఆశిస్తున్నారట. ఇప్పటికే బీజేపీ పార్టీకి చెందిన ఢిల్లీ పెద్దలతో చర్చలు జరిపారట. ఈ ఇద్దరు నేతలు కూడా మొన్న జరిగిన ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీ చేసి ఓడిపోయారు. ఈ నేపథ్యంలోనే మళ్లీ మెదక్ ఎంపీగా పోటీ చేయాలని బలంగా అనుకుంటున్నారట. రఘునందన్ రావు దుబ్బక బీజేపీ అభ్యర్థిగా,ఈటెల రాజేందర్ గజ్వేల్ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. పోయిన చోటనే వెతకాలి అనే సామెత ప్రకారం ఎక్కడ ఓడిపోయారో అక్కడే గెలిచి చూపించాలని ఈ టికెట్ ఆశిస్తున్నారట. బీజేపీ పార్టీలో ఇద్దరు సీనియర్ లీడర్లు మెదక్ ఎంపీ టికెట్ అడగడంతో బీజేపీ అధిష్టానం కూడా కొంత అయోమయంలో పడిందట. ఎవరికి ఇవ్వాలో అర్థం కాక తలలు పట్టుకుంటున్నారట పార్టీ పెద్దలు. ఈటెల రాజేందర్ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై పోటీ చేసి ఓటమి పాలైన నేపథ్యంలో, తనకు ఎంపీగా అవకాశం ఇవ్వాలని, అక్కడి నుంచి గెలిచి చూపిస్తానని చెబుతున్నారని తెలుస్తోంది. ఇక రఘునందన్ కూడా గతంలో ఎంపీగా పోటీ చేసిన అనుభవం ఉంది కాబట్టి ఈసారి తనకు ఎంపీ టికెట్ ఇవ్వాలని కోరుతున్నారట. ఈ ఇద్దరు నేతలు ఇలా టికెట్ కోసం ప్రయత్నాలు మొదలు పెట్టారని తెలియగానే, మెదక్ పార్లమెంటు పరిధిలోని 7 నియోజకవర్గాల బీజేపీ సీనియర్ లీడర్ల రహస్య సమావేశం ఏర్పాటు చేసుకున్నారట. ఎంపీ ఎన్నికల్లో కొత్త వారికి టికెట్ ఇవ్వాలని, మొన్న జరిగిన ఎమ్మెల్యే ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన నేతలకు ఎంపీ టికెట్ ఇవ్వద్దు అని తీర్మానం చేసుకున్నారట. ఈ తీర్మానాన్ని పార్టీ పెద్దలకు కూడా ఇచ్చారట. ఇక రఘునందన్ రావు ఒక అడుగు ముందుకు వేసి తనకు మెదక్ ఎంపీ టికెట్ కన్ఫర్మ్ అవుతుంది. మీరు నాకు సపోర్ట్ చేయాలని కొంతమంది పార్టీ నేతలకు ఫోన్లు చేసి మరీ చెబుతున్నారట. ఈ విషయం తెలుసుకున్న ఈటెల రాజేందర్ కూడా తన ప్రయత్నాలను ఇంకా స్పీడప్ చేశారని సమాచారం.

# ఆడ వారిద్దరే!

**మొదటిపేజీ తరువాయి..**
మల్లు నందిని అధిష్టానం ఆదేశిస్తే ఎంపీగా పోటీ చేస్తానని చెబుతున్నారు. పార్లమెంట్ టికెట్ కోసం ఇప్పటి నుంచే ఆమె ప్రయత్నాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. పార్లమెంట్ పరిధిలోని పలు నియోజకవర్గాల్లో ప్రైవేట్ కార్యక్రమాల్లోనూ పాల్గొంటున్నారు నందిని. ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలని చాలా రోజుల నుంచి ఆమె ఆసక్తి చూపిస్తున్నారు. ఇప్పటికే అమ్మా ఫౌండేషన్ పేరిట విస్తృతంగా సామాజిక సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మల్లు నందిని పొలిటికల్ ఎంట్రీ కోసం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కూడా చక్రం తిప్పుతున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అయితే.. కాంగ్రెస్ ఫైర్ బ్రాండ్ రేణుకా చౌదరి కూడా ఖమ్మం టికెట్‌ను అంత ఈజీగా వదులుకునే అవకాశం లేదన్న చర్చ కూడా జిల్లా రాజకీయాల్లో వినిపిస్తుంది. గతంలో కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీని కలిసి ఖమ్మం లోక్ సభ స్థానం నుంచి పోటీ చేయాలని రేణుకా చౌదరి కోరారు. దక్షిణాది నుంచి పోటీకి సోనియా గాంధీ విముఖత చూపడంతో ఖమ్మం పార్లమెంట్ స్థానం నుంచి తానే పోటీ చేయాలని రేణుకా చౌదరి నిర్ణయించుకున్నారు. హైకమాండ్ మద్దతు కూడా తనకే ఉందన్న ధీమాలో రేణుకా చౌదరి ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో అభ్యర్థుల గెలుపు కోసం రేణుకా చౌదరి విస్తృతంగా పని చేశారు. తాను జిల్లా ఆడబిడ్డనని తనకే టికెట్ పక్కా అని ఆమె అనేకసార్లు చెప్పారు. అయితే.. ఖమ్మం ఎంపీ స్థానానికి ఇన్చార్జిగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి కాంగ్రెస్ పార్టీ బాధ్యతలు అప్పగించింది. దీంతో కాంగ్రెస్ ఈ ఇద్దరిలోనే ఒకరికి అవకాశం దక్కుతుందా? లేక కాంగ్రెస్ పార్టీ కొత్తగా మరొకరికి అవకాశం ఇస్తుందా? అన్న అంశం ఆసక్తికరంగా మారింది.

# ఇదేం అభిమానమో..!



**మొదటిపేజీ తరువాయి..**
కియా కార్ల కంపెనీని కూడా గుజరాత్‌కు తరలించుకునే ప్రయత్నం చేశారు. కానీ ఫలించలేదు. తాజాగా దేశానికి వస్తున్న ప్రముఖ కార్ల తయారీ కంపెనీని కూడా గుజరాత్‌లో ఏర్పాటు చేయబోతున్నారు. దీంతో దక్షిణాదిపై ఎంత వివక్ష ఉందో అన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. దేశమంతా గొడ్డుపోయినట్లు.. పరిశ్రమలన్నీ మోదీ తన సొంత రాష్ట్రానికి తరలించుకుపోతున్నారన్న అభిప్రాయం మిగతా రాష్ట్రాల ప్రజల్లో వ్యక్తమవుతోంది. దేశంలో ప్రజలు అంటే ఒక్క గుజరాతేనా.. మోదీ ఒక్క గుజరాత్‌కే ప్రధానా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఆయన తీసుకుంటున్న నిర్ణయాల కారణంగా దేశంలోని అనేక రాష్ట్రాలకు పరిశ్రమలు, ప్రాజెక్టులు రావడం లేదు. తాజాగా విదేశీ సంస్థ టెస్లాను కూడా సొంత రాష్ట్రానికి మోదీ తరలించుకుపోతుండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నేడో రేపో అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.దేశంలో అనేక రాష్ట్రాలు పారిశ్రామికంగా వెనుకబడ్డాయి. నిరుద్యోగిత రేటు పెరుగుతోంది. కొత్త పరిశ్రమలు కావాలని యువత కోరుకుంటోంది. కానీ ఇవేమీ మోదీ పట్టించుకోవడం లేదు. ఇటీవలే సూరత్‌లో అతిపెద్ద వ్యాపార సముదాయం ప్రారంభించారు. దీంతో 1.5 లక్షల మందికి ఉపాధి లభిస్తుందని స్వయంగా మోదీ ప్రకటించారు. ఇలాంటి తరుణంలో తాజాగా టెస్లా కార్ల తయారీ సంస్థను కూడా గుజరాత్‌కే తరలించుకుపోవడం విమర్శలకు తావిస్తోంది. రాబోయే వైబ్రంట్ గుజరాత్ గ్లోబల్ సమ్మిట్ జనవరి 2024లో జరగబోతోంది. ఇందులో టెస్లాకు సంబంధించిన అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది. ఈ కార్యక్రమానికి ఎలాన్ మస్క్ కూడా హాజరు కానున్నట్లు సమాచారం. అయితే దీనికి సంబంధించి టెస్లా నుంచి ఇంకా ఎలాంటి అధికారిక సమాచారం రాలేదు. టెస్లా స్థానిక స్థాయిలో బ్యాటరీ ప్యాక్‌లను కూడా ఉత్పత్తి చేస్తే ఈవీ సెగ్మెంట్ పర్యావరణ వ్యవస్థను ప్రోత్సహించడంలో కూడా సహాయపడుతుంది.ప్రపంచంలోని అతిపెద్ద ఆటో మార్కెట్లలో ఒకటైన భారతదేశంలో టెస్లా ప్రవేశిస్తే పెద్ద మార్పులు జరిగే అవకాశం ఉంది. అంతేకాకుండా టెస్లా భారతదేశం కోసం చేసిన వాగ్దానాన్ని నెరవేర్చడానికి కూడా ప్రయత్నిస్తుంది. టెస్లా భారతదేశంలోకి ప్రవేశించి ఎలక్ట్రిక్ ప్యాసింజర్ కార్ల సెగ్మెంట్‌ను ప్రోత్సహించడంతోపాటు ఈవీ విభాగంలో స్థిరపడేందుకు ఆసక్తిగా ఉంది.టెస్లా మోడల్ 3, టెస్లా మోడల్ వై వంటి కార్లను సీబీయూ ద్వారా ఇక్కడకు తీసుకువస్తుందని వార్తలు వస్తున్నాయి. అయితే తయారీకి సంబంధించి కమిట్‌మెంట్‌ను టెస్లా ఇస్తే దిగుమతి పన్నును కూడా తగ్గించే అవకాశం ఉంది. ఇటీవలే లాంచ్ అయిన మోడల్ 3ని కూడా భారతదేశానికి తీసుకువచ్చే అవకాశం ఉంది. రాబోయే సంవత్సరాల్లో మరింత చవకైన స్థానికంగా ఉత్పత్తి అయిన మోడల్ 2 కూడా భారతదేశంలోకి రానుందని తెలుస్తోంది.మరోవైపు కియా మోటార్స్ కూడా భారతీయ మార్కెట్ కోసం ఒక అద్భుతమైన విజన్‌ని వెల్లడించింది. సెల్టోస్ మిడ్ సైజ్ ఎస్‌యూవీతో విజయాన్ని అందుకున్న కంపెనీ ఇటీవల దానికి మిడ్ లైఫ్ అప్‌డేట్‌ను ఇచ్చింది. దీని తర్వాత 2024 జనవరిలో సోనెట్ ఫేస్‌లిఫ్ట్‌ను లాంచ్ చేయనుంది. ఇది కాకుండా హ్యుందాయ్ ఎక్స్‌టర్ తరహాలో ఒక మాస్ మార్కెట్ ఎలక్ట్రిక్ వాహనం కూడా లాంచ్ కానుంది. కంపెనీ ఇటీవలే భారతదేశంలో 'కియా క్లావిస్' పేరును ట్రేడ్‌మార్క్ రిజిస్టర్ చేసింది. ఈ పేరును కంపెనీ రాబోయే ఎలక్ట్రిక్ మైక్రో ఎస్‌యూవీ కోసం ఉపయోగిం చ వచ్చు అనేక రాష్ట్రాలు పరిశ్రమలకు రాయితీలు ఇస్తామని చెబుతున్నా.. మోదీ ఎవరికీ అవకాశం ఇవ్వడం లేదు. నిబంధనల ప్రనకారం దేశంలోకి వచ్చే పరిశ్రమలు, పెట్టుబడులను కేంద్రం అన్ని ప్రాంతాలకు సిఫారసు చేయాలి. అనువైన ప్రాంతాలను సంస్థలు ఎంచుకునే స్వేచ్ఛ ఇవ్వాలి. కానీ, మోదీ సర్కార్ అలా చేయడం లేదు. పారిశ్రామికీకరణకు అనువైన ఉత్తర ప్రదేశ్, బీహార్ రాష్ట్రాలకు కూడా ప్రధాని అన్యాయం చేస్తున్నారు. గుజరాత్‌ను మాత్రం పారిశ్రామికంగా అభివృద్ధి చేసుకుంటున్నారు.

# నకిలీ డ్రగ్స్ స్వాధీనం

**మొదటిపేజీ తరువాయి..**
హైదరాబాద్కు నకిలీ డ్రగ్స్ రవాణాకు సంబంధించిన విశ్వసనీయ సమాచారంపై ప్రత్యేక బృందం దిల్సుఖ్నగర్ మరియు ఉప్పల్లోని కొరియర్ కార్యాలయాలపై దాడులు నిర్వహించింది మరియు 'మెషిన్ పార్ట్స్' ఉన్నట్లు పేర్కొంటున్న ఒక్కొక్కటి 14.5 కిలోలు మరియు 13.34 కిలోల బరువున్న రెండు పార్శిళ్లను ఉత్తరాఖండ్లోని కాశీపూర్లో రామ్నగర్ రోడ్లోని అమర్ ఫార్మాస్యూటికల్స్ ద్వారా బుక్ చేసినట్లు కనుగొన్నారు. , కాశీపూర్ మరియు పేర్కొన్న పొట్లాలను పువ్వాడ లక్ష్మణ్, హైదరాబాద్ మొబైల్ నంబర్ 8309612706కు డెలివరీ చేశారు. డిసిఎ అధికారులు పువ్వాడ లక్ష్మణ్‌ను, అతని మొబైల్ నంబర్ ద్వారా గుర్తించడానికి పోలీసు అధికారుల సహాయం తీసుకున్నారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని శివగంగా థియేటర్ సమీపంలోని బార్లో అతన్ని పట్టుకున్నారు.

# ఆ'కట్టుకుంటున్న చలానా' ఆఫర్

**మొదటిపేజీ తరువాయి..**
రూపాయల మేర వసూలు అయినట్లు సమాచారం. ఇలా ఈ చలాన్ వెబ్‌సైట్‌పై విపరీతంగా ఒత్తిడి పడుతుండడంతో అప్పుడప్పుడు సైట్ క్రాష్ కూడా అవుతోంది. చాలా మంది యూజర్లు ఈ చలాన్ వెబ్‌సైట్ ఓపెన్ చేసి ట్రాఫిక్ చలానాలు క్లియర్ చేసే క్రమంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డిసెంబర్ 28వ తేదీ రాత్రి అంటే గురువారం రాత్రి 10:30 గంటల వరకు రాష్ట్రవ్యాప్తంగా 9.80 లక్షలకు పైగా చలాన్లు క్లియర్ అయ్యాయి. అత్యధికంగా హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 3.84 లక్షల చలాన్లకు రూ.2.90 కోట్లు, సైబరాబాద్ పరిధిలో 2.2 లక్షల చలాన్లకు రూ.1.90 కోట్లు, రాచకొండ కమిషనరేట్ పరిధిలో 97వేల చలాన్లకు రూ.81 లక్షలు వాహనదారుల నుంచి వసూలు చేశారు. చలాన్ సైట్‌పై తాకిడి పెరగడంతో సర్వర్లు కూడా మొరాయిస్తున్నాయి. దీన్ని బట్టి.. పెండింగ్ చలానాల పేమెంట్లు కట్టేందుకు ఎంత స్పందన వస్తుందో అర్థమవుతోంది. టూవీలర్లు, త్రీ వీలర్లకు 80 శాతం, బస్సులకు 90 శాతం, కార్లు, హెవీ మోటార్ వెహికిల్స్‌కు 60 శాతం డిస్కౌంట్ ఇచ్చింది. పెండింగ్ చలాన్లకు రాయితీ ఇవ్వడంతో దొరికిందే ఛాన్స్ అని.. ఆలస్యం చేయకుండా చలానాలు కట్టేస్తున్నారు వాహనదారులు. గత ఏడాది కూడా పెండింగ్ చలానాల వసూళ్ల కోసం ఇలాంటి ఆఫర్‌నే ప్రకటించారు. అప్పుడు కూడా పెండింగ్ చలాన్ల ద్వారా ఏకంగా 300 కోట్ల ఆదాయం సమకూరింది. కాగా.. ఈ ఏడాది కూడా సుమారు 2 కోట్ల చలానాలు పెండింగ్‌లో ఉండటంతో.. మరోసారి పెండింగ్ చలాన్లపై డిస్కౌంట్ ప్రకటించారు. డిసెంబర్ 26ను ఈ ఆఫర్ ప్రారంభించారు. జనవరి 10వ తేదీ వరకు డిస్కౌంట్‌తో పెండింగ్ చలానాలు కట్టే అవకాశాన్ని ట్రాఫిక్ పోలీసులు కల్పించారు.

# నగరాన్ని కప్పేసిన మంచు దుప్పటి



**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :**
నగరం లో రోజు రోజుకి ఉష్ణోగ్రత లు పడిపోతు0డటంతో నగరమంతా మంచి దుప్పటితో కప్పి వేయబడింది. నగర శివాలలో హయత్ నగర్ వనస్థలిపురం రహదారుల్లో ఉదయం 8.30 గంటల సమయం లో కూడా నగరాన్ని మంచు దుప్పటి కప్పేసింది,చలి ఎక్కువగా అవడం,మంచు పొగతో కప్పి వేయటం తో నగర వాసులు బయటకి వెళ్ళడానికి అదేవిధంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు,ముందు వాహనాలు కనపడక లైట్ లు వేసుకుని వెళ్ళారు వాహనదారులు..

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
# ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

## ఎల్ఐసీతో కుటుంబాలకు రక్షణ



**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :**
;నూతన సంవత్సరం సందర్భంగా ఎల్ఐసి చీఫ్ లైఫ్ ఇన్సూరెన్స్ అడ్వైజర్ లయన్ కె ఎన్ సామ్రాట్ ఆద్వర్యం లో హిమాయత్ నగర్ బ్రాంచ్ తరపున రూపొందించిన నూతన సంవస్సతరం 2024 డైరీని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఎల్ఐసి సంస్థలో గత 20 సంవత్సరాలుగా విశిష్ట సేవలు అందించి 4000 పైగా పాలసీలను చేయించిన సామ్రాట్ చేస్తున్న సేవలను అభినందించారు. ప్రతి ఒక్కరూ తమ జీవితాలను భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఎల్ఐసి పాలసీలు తీసుకుని కుటుంబాలకు రక్షణ కల్పించాలని మంత్రి పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో చేనేత వర్గాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షులు చిక్క దేవదాసు,బీసీ సంక్షేమ సంఘం మహిళా రాష్ట్ర కన్వీనర్ బిల్లా దీపిక, ఆదర్శ కిరణం ఎడిటర్ వంగాల బాలరాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కేరళ నుంచే వేరియంట్ జేఎన్-1 ఎందుకు?

ప్రపంచంలో ఏ మూలకు వెళ్లినా.. కేరళ వారు ఒకరు ఉంటారు అంటారు. ఇది వాస్తవమే. భారత్ లోని మిగతా రాష్ట్రాల కంటే కేరళ చాలా ముందుంటుంది. అన్ని రంగాల్లోనూ ఆ రాష్ట్రం ప్రగతి పథంలో పయనిస్తుంది కూడా. దేశంలోనే తొలి వంద శాతం అక్షరాస్యత సాధించిన జిల్లా కేరళలోని కొట్టాయం అని 40 ఏళ్ల క్రితమే పాఠ్య పుస్తకాల్లో రాశారు. అంతటి ప్రగతి కేరళ సొంతం. అంతేకాదు.. నర్సింగ్ నుంచి మేనేజ్ మెంట్ దాకా వివిధ రంగాల్లోని ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవడంలోనూ కేరళీయులకు మరే భారత రాష్ట్ర పౌరులు సాటిరారు. గల్ఫ్, అమెరికా, కెనడా, సింగపూర్, మలేసియా, దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్.. ఇలా ఎక్కడైనా కేరళ వాసుల విజయ పతాకను చూస్తుంటాం. అనేక ఆయుర్వేద ఔషధాలకు, ప్రకృతి సంపదకు కేరళ రాష్ట్రం నెలవు. అందమైన ఈ కేరల రాష్ట్రం ఇప్పుడు వైరస్‌కు కేరాఫ్‌గా మారుతోంది. దేశంలో కోవిడ్‌తో మొదలు తాజాగా కొత్త వేరియంట్ జేఎన్–1 వరకు అన్ని వైరస్‌ల వ్యాప్తి ఇక్కడి నుంచే మొదలైంది. రాష్ట్రానికి చెందిన 79 ఏళ్ల మహిళలో ఈ కొత్త వైరస్‌ను కనుగొన్నారు. ఇక రాష్ట్రంలో డిసెంబర్ 1 నుంచి 17 వరకు ఈ వైరస్‌తో 10 మంది మరణించడం ఆందోళన కలిగిస్తోంది. దీంతో అప్రమత్తమైన కేంద్రం.. అన్ని రాష్ట్రాలను అలర్ట్ చేసింది.కోవిడ్ కేసుల్లో దేశంలో కేరళ మొదటి స్థానంలో ఉంది. తొలి కోవిడ్ కేసు కూడా చైనా నుంచి కేరళకు వచ్చిన యువకుడిలోనే నమోదైంది. ఇక తాజాగా కొత్త వేరియంట్ జేఎన్–1 కూడా కేరళలోనే వెలుగు చూసింది. ఇక తాజాగా నమోదవుతున్న కోవిడ్ కేసులు కేరలలోనే ఎక్కువగా ఉంటున్నాయి. డిసెంబర్ 16న, కేరళలో 302 కొత్త కోవిడ్ కేసులు నమోదు కాగా నలుగురు మరణించారు. డిసెంబర్ 10న 109 కేసులు వెలుగు చూశాయి. డిసెంబర్ 12న కేసుల సంఖ్య 200కు పెరిగింది. 17న 300 కొత్త కేసులు నమోదయ్యాయి. జేఎన్–1 కొత్త వేరియంట్‌ను మొదట ఆగస్టులో కేరళలో గుర్తించారు. ఈ వైరస్ అంతకు ముందు చైనా అమెరికా, సింగపూర్‌లో వెలుగు చూసింది. కొత్త ఉప?వేరియంట్ వల్ల కలిగే కోవిడ్–19 కు సంబంధించిన లక్షణాలు, తీవ్రతపై, ఆరోగ్య కార్యదర్శి, రాష్ట్రాలతో ప్రభుత్వం పంచుకున్న అనుబంధంలో, జేఎన్–1 సంక్రమణ ఇతర వేరియంట్ల నుంచి వేర్వేరు లక్షణాలను ఉత్పత్తి చేస్తుందో లేదో తెలియదు .నిఫా.. జికా.. కొవిడ్.. మంకీ పాక్స్.. భారత్ లో ఏ వైరస్ కేసయినా తొలిగా కనిపిస్తోంది కేరళలోనే. తాజాగా దేశంలో రెండు మంకీ పాక్స్ కేసులు రాగా.. రెండూ కేరళవే. వీరిద్దరూ ఇతర దేశాల నుంచి వచ్చిన వారే. ఈ ఏడాది ప్రారంభంలో నిఫా వైరస్ కేరళను వణికించింది. అయితే, వ్యాప్తి అక్కడితోనే ఆగిపోయింది. ఇక జికా వైరస్ గురించి కూడా కేరళలో కలకలం రేపింది. ఏడిస్ ఈజిప్టై దోమ కుట్టడం ద్వారా వ్యాపించే ఈ వ్యాధి బారినపడినవారు పెద్దఎత్తున ఉన్నారు.ఇవే దోమలు చికన్ గన్యా, డెంగీని కూడా వ్యాపింపజేస్తాయి. నిఫా వైరస్ గబ్బిలాల నుంచి వ్యాపిస్తుంది. వాటి లాలాజలం, మూత్రం, రక్తంలో ఈ వైరస్ ఉంటుంది. పండ్లు, పందులు, ఇతర మార్గాల ద్వారా మనుషులకు అంటుకుంటుంది. మెదడుపై ప్రభావం చూపే ఈ వైరస్ కారణంగా 40 నుంచి 75 శాతం మంది రోగులు చనిపోయే ప్రమాదం ఉంది.తొలి రెండు కొవిడ్ కేసులు ప్రపంచాన్ని మూడేళ్లుగా వణికిస్తున్న కొవిడ్‌కు సంబంధించి భారత్ లో తొలి కేసు కేరళలోనే నమోదైంది. చైనా నుంచి వైద్య విద్యార్థినికి 2020 జనవరి 27న పాజిటివ్ గా తేలింది. రెండో కేసు కూడా ఈ రాష్ట్రంలోనే నమోదైంది. అయితే, వీరు త్వరగానే కోలుకున్నారు. కాకపోతే.. భారత్ లో కొవిడ్ తొలి కేసులుగా ముద్రపడ్డారు. కాగా, తదనంతర పరిస్థితుల్లో కొవిడ్ దేశంలోనే కాక ప్రపంచంలో ఎంతటి ప్రళయం రేపిందో అందరికీ తెలిసిందే. కొవిడ్ రెండో, మూడో వేవ్ లోనూ కేరళలో కేసులు అత్యధికంగా వచ్చాయి.కొత్త వేరియంట్ కేసులు కేరళలో పెరుగుతుండడంతో ఆరోగ్య కార్యదర్శి అన్ని రాష్ట్రాలను అలర్ట్ చేశారు. కోవిడ్ –19 పరిస్థితిపై నిరంతరం జాగరణను కొనసాగించాల్సిన అవసరాన్ని కేరళకు ప్రత్యేకంగా సూచించారు. జిల్లా వారీగా ఇన్‌ఫ్లూంజా లాంటి అనారోగ్యం తీవ్రమైన అక్యూట్ రెస్పిరేటరీ అనారోగ్యం కేసులను అన్ని ఆరోగ్య సదుపాయాలలో రోజూ ఇంటిగ్రేటెడ్ హెల్త్ ఇన్ఫర్మేషన్ ప్లాట్‌ఫాం పోర్టల్‌తో సహా, గుర్తించడానికి ఆయన కోరారు.ఇక కేరళలోనే కొత్త వైరస్‌లు వెలుగు చూడడానికి ప్రధాన కారణం ఇక్కడి నుంచి నిత్యం వేలాది మంది విదేశాలకు రాకపోకలు సాగించడమే. అక్షరాస్యత, ఉన్నత విద్యావంతులు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఉద్యోగాలు, ఉపాధి కోసం విదేశాలకు వెళ్తున్నారు. మరోవైపు కేరళ పర్యాటక రాష్ట్రం కావడంతో విదేశీయులు కూడా ఎక్కువగా కేరళకు వస్తుంటారు. ఇత విదేశాలకు వెళ్లే కేరళ వాసులు, కేరళ నుంచి కేరళకు వస్తున్న విదేశీయులు కొత్త కొత్త వైరస్‌లను మోసుకొస్తున్నారు. ఈ నేపథ్యంలోనే కేరళలోనే కొత్త వైరస్‌లు వెలుగులోకి వస్తున్నాయి. ఇక కేరళలో దట్టమైన అడవులు ఉండడం, గబ్బిలాల సంఖ్య కూడా ఎక్కువగా ఉంటోంది. విదేశాల నుంచి కూడా పక్షులు ఇక్కడికి వస్తుంటాయి. వీటి ద్వారా కూడా కొత్త రకమైన వైరస్‌లు కేరళకు వస్తున్నట్లు తెలుస్తోంది.

## అప్పులు తీర్చలేక దొంగగా మారిన యువకుడు



**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :**
బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో పలు ఇళ్లలో దొంగతనాలకు పాల్పడిన వ్యక్తిని సిసిఎస్, బోరబండ క్రైమ్ పోలీసులు నిందితుడను చాకచక్యంగా పట్టుకున్నారు. శనివారం బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్సార్ నగర్ ఏసిపి, బోరబండ పోలీస్ స్టేషన్ సీఐ విజయ్ కుమార్, డి ఐ భూపాల్ లతో కలిసి నిందితుడి వివరాలను మీడియాకు వెల్లడించారు. ఎసిపి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బోరబండలో గత కొంతకాలంగా ఇళ్లలో దొంగతనాలకు పాల్పడి తప్పించుకు తిరుగుతున్న మణికంఠ అనే ఒక దొంగని అదుపులోకి తీసుకున్నామన్నారు.
మొత్తం 207 గ్రాముల బంగారం, 5000 నగదును చోరీ చేసినట్టు పోలీసులు విచారణలో తేలింది. ఎమ్మెస్ మక్తా లో నివాస ముంటు పంజాగుట్ట లోని పి వి ఆర్ లో బాక్స్ లో పని చేస్తూ ఉండేవాడు. స్వస్థలం ఈస్ట్ గోదావరి లోని మల్లేపల్లి వాసి. ఆన్లైన్లో గ్యాంబ్లింగ్, ఇతర గేములు ఆడటం ద్వారా ఆర్థికంగా నష్టపోయాడు. ఉద్యోగం చేసే డబ్బులు అతనికి సరిపోయేవి కాదు. దీంతో సులభంగా డబ్బులు సంపాదించి అప్పులు తీర్చాలనే ప్లాన్ వేసుకుని కొన్ని రోజులు బోరబండ లోని పలు ప్రాంతాల్లో రెక్క నిర్వహించి అనంతరం దొంగతనం జేసేవాడు. బాధితులు ఫిర్యాదు మేరకు బోరబండ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగించి సిసిఎస్ పోలీసులతో కలిసి మణికంఠను అరెస్టు చేసినట్లు ఏసిపి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఇది ఇలా ఉండగా అతని వద్ద నుండి 54 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. నిందితుడని నేస్తమా ముందు హాజరు పరిచి కస్టడీలోకి తీసుకొని చేసిన మరింతగా దర్యాప్తు చేస్తామన్నారు.



## 3 డిజైన్లలో దానికే ఓటు..

**అయోధ్య, ప్రభాతసూర్యుడు :** అయోధ్యలోని రామ మందిర ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. వచ్చే ఏడాది జనవరి 22న ప్రధాని మోదీ చేతుల మీదుగా అయోధ్య రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ జరగనుంది. అయితే... రాముడి విగ్రహానికి సంబంధించి మొత్తం మూడు డిజైన్‌లు తయారు చేయించింది శ్రీరామ జన్మ భూమి తీర్థక్షేత్ర ట్రస్ట్. వీటిలో ఏది ఎంచుకోవాలో తేల్చు కునేందుకు ఓటింగ్ నిర్వహించింది. మూడు డిజైన్స్‌లో దేనికి ఎక్కువ ఓట్లు పడితే ఆ విగ్రహాన్నే ప్రాణప్రతిష్ఠ చేయనున్నారు. 51 ఇంచుల పొడవు ఉన్న ఐదేళ్ల బాల రాముడి విగ్రహం కొలువుదీరనుంది. "శిల్పులు మూడు విగ్రహాలు తయారు చేశారు. వీటిలో ఏది ప్రాణప్రతిష్ఠ చేయాలో ఓటింగ్ ద్వారా నిర్ణయించుకోవాలని భావించాం. అందుకే ఓటింగ్ పెట్టాం. ఏ డిజైన్‌కైతే ఎక్కువ ఓట్లు వస్తాయో ఆ విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తాం. ఆ విగ్రహంలో ఆధ్యాత్మికత ఉట్టిపడుతుంది" శ్రీరామ మందిర్ నిర్మాణ కమిటీ ఛైర్మన్ నృపేంద్ర మిశ్రా నిర్మాణ పనులను పరిశీలించారు. వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. మరో రెండు రోజుల్లో ప్రధాని నరేంద్ర మోదీ అయోధ్యలో పర్యటించనున్నారు. ఈ క్రమంలోనే పనులను వేగంగా పూర్తి చేస్తున్నారు. అదే సమయంలో నాణ్యతలో ఎక్కడా రాజీపడడం లేదని ట్రస్ట్ స్పష్టం చేసింది. "మొత్తం మూడు దశల్లో ఆలయ నిర్మాణాన్ని చేపట్టాం. ఇందులో మొదటి ఫేజ్ ఈ డిసెంబర్‌తో ముగిసిపోతుంది. రెండో దశలో ఆలయ నిర్మాణం పూర్తవుతుంది. మూడో దశలో కాంప్లెక్స్‌లో కొన్ని నిర్మాణ పనులు పూర్తి చేస్తాం. భద్రతాపరంగానూ అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం"ప్రాణప్రతిష్ఠ జరిగే ముందే కీలక కార్యక్రమాలు నిర్వహించనుంది ట్రస్ట్. జనవరి 17న బాలరాముడి విగ్రహం అయోధ్యకు చేరుకుంటుంది. అదే రోజున భక్తులు మంగళ్ కలశంలో సరయు నది నీళ్లు తీసుకొస్తారు. జనవరి 18న గణేశ్ పూజతో కార్యక్రమం మొదలవుతుంది. ఆ తరవాత వరుణ పూజ, మాత్రిక పూజ, వాస్తు పూజలు జరుగుతాయి. జనవరి 19వ తేదీన హోమం చేయనున్నారు. జనవరి 20న వాస్తు శాంతి చేస్తారు. జనవరి 21వ తేదీన రాముడి విగ్రహానికి అభిషేకం జరుగుతుంది. ఇక చివరగా జనవరి 22న మృగశిర నక్షత్రంలో రాముడి విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుంది. అయోధ్య రామయ్య ఆలయం నిర్మాణంలో మన తెలంగాణ కీర్తి శాశ్వతంగా కనిపించబోతోంది. రామయ్య ఆలయానికి సంబంధించిన తలుపులు, ద్వారాలను అందించే మహద్భాగ్యం మన 'భాగ్య' నగరానికి దక్కింది. బంగారు పూతతో 18 ప్రధాన ద్వారాలు, 100 తలుపులు అయోధ్య కోసం సుందరంగా, శరవేగంగా తీర్చిదిద్దుతున్నారు. గతంలో తమిళనాడుకు చెందిన 70మంది అధికారుల బృందం దేశంలోని ప్రముఖ ఆలయాలను సందర్శించి అక్కడ పలు కళాకృతులను, శిలల వైభవాన్ని పరిశీలించింది.



## వరంగల్ ఆస్పత్రిలో కరెంట్ కట్

**వరంగల్, ప్రభాతసూర్యుడు :**
వరంగల్ లోని ఎంజీఎం ఆస్పత్రిలో కోతుల చేష్టలు రోగులకు ఊహించని అవస్థలు తెచ్చిపెట్టాయి. శుక్రవారం అర్ధరాత్రి దాదాపు రెండు గంటలపాటు ఆ పెద్దాసుపత్రిని కారు చీకట్లు కమ్ముకున్నాయి. పవర్ కట్ అవడంతో రోగులు ఇబ్బందులు పడ్డారు, సిబ్బంది పరుగులు పెట్టారు. వైద్యులు టార్చ్ లైట్ వెలుగుల్లో వైద్యం అందించారు. ఉత్తర తెలంగాణ జిల్లాలకు గుండెకాయ లాంటి ఎంజీఎం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో రోగులు దాదాపు రెండు గంటల పాటు ఊపిరి బిగ పట్టుకున్నంత పనైంది. ఎంజీఎం సిబ్బంది అయోమయంతో పరుగులు పెట్టారు. రెండు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో చిమ్మ చీకట్లోనే వైద్యం అందించారు..ఐతే ఉరుకులు పరుగులు చేసిన ఎంజీఎం సిబ్బంది చివరకు కోతుల నిర్వాకం వల్ల జరిగిన సమస్యను గుర్తించి చక్కదిద్దారు. ఎంజీఎం ఆసుపత్రిలోని అత్యవసర వైద్య విభాగం వెనుకాల ఏఎంసీకి వెళ్లే దగ్గర కోతులు విద్యుత్తు స్తంభాల తీగలపై అటు ఇటు దూకడంతో తీగలు ఒకదానికి ఒకటి రాసుకొని మంటలు లేచి ట్రాన్స్ఫార్మర్ పేలి పోయింది. అందులో నుంచి మంటలు వచ్చి విద్యుత్తు సరఫరా నిలిచి పోయింది. దీంతో ఆసుపత్రిలోని అత్యవసర విభాగం, ఏఎంసీ, నవజాతశిశు సంరక్షణ కేంద్రం (ఎస్ఎన్సీయూ), ఆర్ ఐసీయూ, ఆపరేషన్ థియేటర్లలో అంధకారం నెలకొని రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

## నిరంతరం పథకాల అమలు



**జగిత్యాల, ప్రభాతసూర్యుడు :**
జగిత్యాల రూరల్ మండలం పొలాస గ్రామంలో ప్రజాపాలన కార్యక్రమంను ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి శనివారం పరిశీలించారు. జీవన్ రెడ్డి మాట్లాడుతూ బడ్జెట్ కొరతతో ఆరు మసాలుగా కళ్యాణాలక్షి చెక్కుల పంపిణీ నిలిపివేసి, ఇపుడు పంపిణీ చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ డిసెంబర్ 7 నుండి పెళ్లి అయినా ప్రతి మహిళకు లక్ష రూపాయలతో పాటు తులం బంగారం ఇస్తాం. ప్రజా పాలనా ఆరు గ్యారంటీల అమలు నిరంతర ప్రక్రియ. ప్రతిపక్ష నాయకులు ఆరు గ్యారంటీలపై అపోహలు సృష్టిస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ పాలనలో దశాబ్దకాలం ఇంటి నిర్మాణ కార్యక్రమం కేవలం ప్రకటనలకే పరిమితమైంది. ఎన్నికలకు ముందు గృహలక్ష్మి పేరిట మంజూరు పత్రాలు జారీ చేసినా, కార్యరూపం దాల్చలేదు. కొత్త పెన్షన్ల మంజూరు మూడేళ్లపాటు నిలిపివేశారు. బిఆర్ఎస్ కు ఓటు వేయకపోతే పెన్షన్ రద్దు అయితదంటూ ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల్లో అపోహ సృష్టించేందుకు ప్రయత్నం చేసింది. గతంలో 2014కు ముందు పీఎఫ్ ఉన్న బీడీ కార్మికులకు మాత్రమే పెన్షన్ ఇచ్చారని, 2014 జూన్ తర్వాత పీఎఫ్ ఉన్న బీడీ కార్మికులకు ఎవ్వరికీ పెన్షన్ ఇవ్వలేదు. రాబోయే కాలంలో రాష్ట్రంలో ప్రభుత్వ సంక్షేమ పథకలు లబ్ది పొందని కుటుంబం ఉండదు...నిరుపేదలకు అండగా నిలిచేలా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215